క్లుప్తంగా

దాతల సహకారం మరువలేనిది

ప్రధానోపాధ్యాయుడు నాగరాజు



పాఠశాలకు మైక్‌సెట్ అందజేస్తున్న నర్సింహ్మా, తదితరులు

షాద్‌నగర్ రూరల్: దాతల సహకారం మరువలేనిదని కమ్మదనం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి తండ్రి కారుకొండ నర్సింహ్మా పాఠశాలకు మైక్‌సెట్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్య అభ్యసించాలన్నారు. ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం దాత కారుకొండ నర్సింహ్మాను ఉపాధ్యాయులు పూలమాల వేసి, శాలువా కప్పి సన్మానించారు.

ఘనంగా అమృత లింగేశ్వరస్వామి కల్యాణం



స్వామి వారి కల్యాణం జరిపిస్తున్న చందన చంద్రశేఖర్ దంపతులు

కేశంపేట: మండల కేంద్రంలోని అమృత లింగేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం భక్తులు, గ్రామస్తులు స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య గ్రామానికి చెందిన మఠం చందన చంద్రశేఖర్ దంపతులు స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విశ్వనాథం, కుమారస్వామి, ప్రభాకర్ రెడ్డి, సురేందర్‌రెడ్డి, పాండుగౌడ్, దత్తకుమార్ రెడ్డి, దశరథం తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

షాబాద్: చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి చేవెళ్ల నియోజకవర్గం అభివృద్ధి కోసం పని చేయాలని కోరారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించాలన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం కుంటుబడిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఆరు గ్యారంటీ పథకాలను అమలుజేస్తోందన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి



చెక్కు అందజేస్తున్న అవినాశ్‌రెడ్డి

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో నవగ్రహ, బొడ్రాయి ప్రతిష్ఠాపనకు రూ. లక్ష విరాళం అంజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సామాజిక సేవాకార్యక్రమాల్లో పాల్గొనాలని అన్నారు. ఆధ్యాత్మిక చింతనతో మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. ఏప్రిల్ 2వ తేదీ నుంచి రుద్రారం గ్రామంలో నిర్వహించబోయే బొడ్రాయి, నవగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి అందరు హాజరు కావలని కోరారు. ఈ కార్యక్రమంలో గుర్రాల విష్ణువర్ధన్‌రెడ్డి, బండ నర్సింహులు, సతీశ్, రమేశ్, కృష్ణ, మధు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'అండగా నిలుస్తాం'

షాబాద్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి బొబ్బిలిగామ గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆవుల మల్లేశ్, నవనీత దంపతుల కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భార్య భర్తల మృతితో కుటుంబం పెద్ద దిక్కుని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

అద్దె భవనాలే దిక్కు!

- ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవంతులు కరువు
- ప్రయివేటు, ఇరుకు గదుల్లో నిర్వహణ
- ఇబ్బందుల్లో సిబ్బంది, అధికారులు



ప్రయివేటు భవనంలో కొనసాగుతున్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం



ఏఈఈ కార్యాలయం క్వార్టర్‌లో కొనసాగుతున్న ఆర్‌అండ్‌బీ, డీఈఈ కార్యాలయం



సీఎల్‌ఆర్‌సీ భవనంలో ఆర్డీఓ కార్యాలయం

చేవెళ్ల: డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాలు, ప్రయివేటులోనే కొనసాగుతున్నాయి. చేవెళ్ల పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రమైనప్పటికీ ఇక్కడ పలు డివిజన్, మండల ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేక కాలం వెళ్ల దీస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల కోసం సొంత భవనాలు కేటాయించకపోవడం విడ్డురంగా ఉంది. నిత్యం ఆయాపనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజలు వస్తుంటారు. సొంత భవనాలు లేక అధికారులు, సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. డివిజన్ కేంద్రమైన చేవెళ్లలో కావాల్సిన ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉన్నా కూడా నిర్మాణానికి స్థలం కేటాయించలేదు. కొన్నింటికి నిధులు మంజూరు చేసి, మరికొన్నింటికి చేయక భవనాల నిర్మాణం ఏర్పాటు చేయలేదు. ఈ ప్రాంతానికి చెందిన ప్రజాప్రతినిధులకు ఈ సమస్యలు కనిపించటం లేదా అని కొందరు ప్రశ్నిస్తున్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకొచ్చినా తమ పాలకులే గొప్ప అని చెప్పుకుంటున్నారే తప్పా వాస్తవానికి పనులు చేయడం లేదు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా ఈ ప్రాంత నాయకులు దృష్టి సారించి డివిజన్, మండలకేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

డివిజన్‌లో కార్యకలాపాలు..

మండల కేంద్రంలో సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్న కార్యాలయాలు చాలా ఉన్నాయి. వాటిలో ప్రధానంగా ఆర్డీఓ కార్యాలయం సీఎల్‌ఆర్‌సీ భవనంలో కొనసాగుతుంది. వ్యవసాయశాఖ, ఉద్యానశాఖలకు డివిజన్, మండల కార్యాలయాల్లో భవనాలు లేక ఓ చిన్న క్వార్టర్స్‌లో నిర్వహిస్తూ ఏళ్ల తరబడిగా కాలం వెళ్ల దీస్తున్నారు. ప్రభుత్వానికి నిత్యం ఆదాయం అందించే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ప్రయివేటు భవనంలో కొనసాగుతుంది. ఖజానతో నిత్యం కళకళలాడే ఎస్‌టీఓ కార్యాలయం పశువైద్యశాలలోని ఓ భవనంలో ఇరుకు గదుల్లోనే కొనసాగిస్తున్నారు. రోడ్లు భవనాల శాఖ డీఈఈ కార్యాలయం పాత ఏఈఈ క్వార్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. ఇరిగేషన్ కార్యాలయానికి సైతం సొంత భవనం లేకపోవటంతో ప్రయివేటు భవనంలో కొనసాగిస్తున్నారు.

ఆదర్శంగా ఉండేలా నిర్మాణాలు చేపట్టాలి..



చేవెళ్ల పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం ఉన్నపటికీ అన్ని మండలాలకు ఆదర్శంగా ఉండేలా ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలు చేపట్టాలి. డివిజన్ కార్యాలయాలతో పాటు మండల కార్యాలయాలు అందుబాటులో ఉన్నా వాటికి సొంత భవనాలు లేకపోవటం బాధాకరం.

–అత్తెల్లి అనంత్‌రెడ్డి, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి, చేవెళ్ల

నిధులు మంజూరు చేయాలి..



డివిజన్ కేంద్రంలో కొనసాగుతున్న వ్యవసాయశాఖ, డివిజన్ కార్యాలయానికి గాని, మండల కార్యాలయానికి సొంత భవనమే లేదు. ఏళ్ల తరబడి ఓ చిన్న బీడీఓ క్వార్టర్స్‌లోనే డివిజన్, మండల కార్యాలయాలు కొనసాగిస్తూ కాలం వెల్లదీస్తున్నారు. రైతుల కోసం వేదికలు ఉన్నాయి. గత ప్రభుత్వం వ్యవసాయశాఖకు డివిజన్ కార్యాలయం, మండల కార్యాలయానికి భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయలేదు. తక్షణమే ప్రభుత్వ కార్యాలయలకు సొంత భవనాలకోసం నిర్మాణ పనులు చేపట్టాలి.

– అల్లి దేవేందర్, సీపీఎం నాయకుడు, చేవెళ్ల

భారీ మెజార్టీతో గెలిపించండి



కొందుర్గు: రేగడిచిల్కమర్రిలో మాట్లాడుతున్న వంశీచందర్ రెడ్డి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: మహబూబ్‌నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఓటర్లను అభ్యర్థించారు. శుక్రవారం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచందర్‌తోపాటు ఎమ్మెల్యే శంకర్ రేగడిచిల్కమర్రిని సందర్శించి మాట్లాడారు. పిలిస్తే పలికే నేత వంశీచందర్ రెడ్డినని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనకు అత్యంత మెజార్టీ ఇచ్చిన రేగడిచిల్కమర్రి గ్రామస్తులను ఎప్పుడు మరిచిపోనని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అదేవిధంగా ఎంపీగా పోటీలో ఉన్న వంశీచందర్ రెడ్డికి అధికంగా ఓట్లు వేసి గెలిపించాలన్నారు. అనంతరం వంశీచందర్ రెడ్డి మాట్లాడుతూ రేగడిచిల్కమర్రికి తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, పార్టీలకతీతంగా తనకు ఓటువేసి గెలిపిస్తే ఎల్లప్పుడు రుణపడి ఉంటానన్నారు. గ్రామానికి చెందిన చెర్కుపల్లి సురేశ్ గ్రామస్తుల దాహార్తీ తీర్చడం కోసం ఏర్పాటుచేసిన వాటర్ ఫిల్టర్‌ను పరిశీలించి ఆయనను అభినందించారు. అనంతరం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు చింతక్రింది సత్యనారాయణ రెడ్డి, కృష్ణా రెడ్డి, వీరేందర్ రెడ్డి, శ్రీరామ్‌లను కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, దామోదర్ రెడ్డి, బాల్‌రాజ్, పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు: ప్రార్థనలో ఎమ్మెల్యే, వంశీచందర్ రెడ్డి

ఇన్ముల్‌నర్వ గ్రామంలో ఇఫ్తార్...

కొత్తూరు: ఇన్ముల్‌నర్వ గ్రామంలో జేపీదర్గా ఆవరణలోని ఓ ఫంక్షన్‌హాల్లో శుక్రవారం మైనార్టీ నాయకుడు ఖాజాపాష ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌విందులో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో పాటు సీడబ్ల్యూఏసీ సభ్యుడు వంశీచంద్‌రెడ్డిలు పాల్గొన్నారు. అంతకు ముందు వారు గ్రామంలో మహిళ సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, జే సుదర్శన్‌గౌడ్, ఆగీరు రవికుమార్ గుప్తా, బాబుముదిరాజ్, పాల్గొన్నారు.

షాబాద్: ఇఫ్తార్‌లు మత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి అన్నారు. షాబాద్‌లోని మసీద్‌లో ఎంపీటీసీ గుండాల అశోక్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొని మాట్లాడారు.

పంటల మార్పిడితో అధిక దిగుబడులు



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

షాద్‌నగర్ రూరల్: నేల స్వభావాన్ని గుర్తించి వేసిన పంటను మళ్లీ వేయకుండా పంటల మార్పిడితో అధిక దిగుబడులు సాధించొచ్చని ఉద్యాన విద్యార్థులు రైతులకు వివరించారు. శుక్రవారం కొండాలక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థినులు ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని ప్రభుత్వ ఆసుపత్రి, అంగన్‌వాడీ కేంద్రం, బ్యాంకు, రైతు వేదిక, తపాలా కార్యాలయం, గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామీణ భాగస్వామిక విశ్లేషణాత్మక సదస్సును నిర్వహించారు. గ్రామంలో ఉన్న నేలల యొక్క స్వభావం, విస్తీర్ణంపై చార్ట్స్ రూపంలో పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. పంటల సాగుకు ముందు నేల ఎలాంటి సారాన్ని కలిగి ఉంది, నేల సారాన్నిబట్టి ఏ పంట వేసుకోవాలని అనే విషయాలను తెలుసుకొని సాగుచేస్తే అధిక దిగుబడి వస్తుందన్నారు.

నేల స్వభావాన్ని గుర్తించకుండా ఇష్టానుసారంగా పంటలువేస్తే నష్టాలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సరోజ, ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థినులు మాధురి, రూప, ఆకాంక్ష, శైలి, లిఖిత, ప్రసన్న, తేజశ్రీ, స్వరూప, లిఖిత, శ్రావణి, రైతులు పోచయ్య, వెంకటేష్‌గౌడ్, ప్రభాకర్‌యాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

'బొమ్మలు గీయడం అభినందనీయం'

షాబాద్: ప్రభుత్వ పాఠశాల గోడలపై మ్యూరల్ ఆర్ట్ ద్వారా రంగు రంగుల బొమ్మలు గీయడం అభినందనీయమని వెల్‌స్పన్ ఆర్‌అండ్‌డీ హెడ్ రీతంరే, వెల్‌స్పన్ ఫౌండేషన్ జనరల్ మేనేజర్ సురేఖ పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని సీతారాంపూర్ ప్రాథమిక పాఠశాలలో వెల్‌స్పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల గోడలపై మ్యూరల్ ఆర్ట్ ద్వారా రంగు రంగుల బొమ్మలను చిత్రీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బొమ్మల ద్వారా చదువు చెబితే సులువుగా నేర్చుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాండురంగారెడ్డి, హెచ్‌ఎం విజయశ్రీ, వెల్‌స్పన్ ఫౌండేషన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ భద్రయ్య, సిబ్బంది సునంద, పూజ, రుతుజా, పర్మీందర్ సంగ్, వెంకటేశ్, రవి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



వెల్‌స్పన్ ఫౌండేషన్ జనరల్ మేనేజర్ సురేఖతో సిబ్బంది

ప్రతిభను వెలికి తీయాలి

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు క్విజ్ పోటీలు దోహదపడుతాయని వెల్‌స్పన్ శిక్షణా ఫౌండేషన్ నిర్వాహకులు భద్రయ్య, హైతాబాద్ హెచ్‌ఎం వసంత పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని హైతాబాద్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఉపయోగ పడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాచన్‌పల్లి హెచ్‌ఎం రవినాయుడు, శిక్షణా ఫౌండేషన్ టీచర్ మనీలా, రాజు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేసిన వసంత

ప్రాణకోటికి నీరే జీవనాధారం

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంచనలత



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కాంచనలత

చేవెళ్ల: జీవకోటికి నీరే జీవనాధారమని, నీటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంచనలత పేర్కొన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో శుక్రవారం ప్రపంచ జల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులు ఎదురైతే రైతాంగానికి తీరని నష్టం సంభవిస్తుందన్నారు. నీటికరువు వస్తే బెంగుళూరు పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. నీరు లేక బెంగుళూరు విలవిలలాడుతుందన్నారు. అందుకే ప్రతిఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని చెప్పారు. వేసవి సందర్భంగా ఎండలు మండిపోతున్నాయని నీటి సమస్య వచ్చే అవకాశాలు ఉన్నాయని నిపుణులు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. అందుకే ప్రతిఒక్కరూ నీటిని కాపాడుకునేందుకు ముందుకు రావాలన్నారు. ప్రతీ ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వేసవిలో జంతువులకు నీటి కరువు రాకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఎన్. జ్యోతి, అధ్యాపకులు రూపా్నరవింద్రన్, వెంకటేశ్వర్లు, శకుంతల, రాగిణి, వెంకటలక్ష్మీ, విరేశం, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై అవగాహన

భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు శ్రీనివాస్‌రెడ్డి

షాబాద్: గ్యాస్ వినియోగం, ప్రమాదాలనివారణపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు శ్రీలక్ష్మి శ్రీనివాస్ భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి, ఇష్టంతో చదవాలన్నారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ప్రత్యేక అధికారి కృష్ణకుమారి, గ్యాస్ సిబ్బంది శివ, నవనీత తదితరులు పాల్గొన్నారు.

'లక్ష్యసాధనకు కృషి'

కొత్తూరు: విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడానికి నిరంతరం కృషి చేయాలని సిద్ధాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శేఖర్ రెడ్డి పేర్కొన్నారు. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు పలువురు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల్లో చదువుకునే విద్యార్థులు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాల్లో సాంకేతికత చాలా వరకు విస్తరించినట్లు వివరించారు. అనంతరం విద్యార్థులు చేసిన పలు నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి. ఈ కార్యక్రమంలో జంగయ్య, బాలయ్య, శ్రీనివాస్‌రెడ్డి, చెన్నారెడ్డి, నరేందర్‌రెడ్డి, జిల్లా సెక్టోరియల్ అధికారి కృష్ణయ్య, ఉపాధ్యాయులు జగదీశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్, విజేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చేవి చలివేంద్రాలు

సీఐ ప్రతాప్‌లింగం



చలివేంద్రాన్ని ప్రారంభించిన సీఐ ప్రతాప్‌లింగంను సన్మానించిన నాయకులు

షాద్‌నగర్: బాటసారుల దాహార్తిని తీర్చేవి చలివేంద్రాలని సీఐ ప్రతాప్‌లింగం అన్నారు. శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలోని పరిగిరోడ్డు పోచమ్మ దేవాలయం వద్ద బీజేపీ నాయకుడు శ్రీనివాస్‌చారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణానికి చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి ప్రతీ రోజు పనుల నిమిత్తం వస్తుంటారని అన్నారు. వేసవి కాలంలో వారి దాహార్తిని తీర్చే విధంగా చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రతిఒక్కరూ సేవా భావాన్ని పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

సీడీపీఓ నాగమణి



సీమంతం నిర్వహిస్తున్న నాగమణి, అరుంధతి

కొత్తూరు: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఐసీడీఎస్ షాద్‌నగర్ డివిజన్ సీడీపీఓ నాగమణి పేర్కొన్నారు. మండలంలోని పెంజర్ల గ్రామంలో శుక్రవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళ దినోత్సవం, పోషణ పక్షోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం చేశారు. అనంతరం ఆమెతో పాటు ఎంపీడీఓ అరుంధతి మాట్లాడుతూ పోషకాలు నష్టపోకుండా ఆహారాన్ని వండుకునే పద్ధతిపై గర్భిణులు, బాలింతలతో పాటు మహిళలకు అవగాహన కల్పించారు. పౌష్టికాహారం లోపిస్తే వచ్చే అనారోగ్యాలు, అనర్థాల గురించి తెలియజేశారు. ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనలో భాగంగా ప్రభుత్వం ఐసీడీఎస్ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్

హెచ్‌సీయూ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సుధాకర్‌బాబు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సుధాకర్‌బాబు

చేవెళ్ల: యువత చేతుల్లోనే దేశ భవిష్యత్ రూపుదిద్దుకుంటుందని హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సుధాకర్‌బాబు పేర్కొన్నారు. శంకర్‌పల్లి మండల కేంద్రంలోని జాగృతి డిగ్రీకళాశాలలో శుక్రవారం రాజీవ్‌గాంధీ జాతీయ యువజన అభివృద్ధి సంస్థ, మానవ వనరుల అభివృద్ధి సంస్థ హెచ్‌సీయూ ఆధ్వర్యంలో 'యువత అభివృద్ధిలో సామాజిక న్యాయం, జాతినిర్మాణంలో యువత పాత్ర, సామాజిక సమస్యలు యువత భాగస్వామ్యం' అనే అంశాలపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో యువతకు కొదవలేదన్నారు. నేటి యువత ముందున్న సవాళ్లు అధిగమించడానికి, సమర్థవంతమైన సంపద సృష్టించడంలోనూ, సక్రమంగా వినియోగించడంలోనూ ముందుకు సాగాలన్నారు. సెల్‌ఫోన్‌లను జ్ఞానం కోసమే ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్యగౌడ్ మాట్లాడుతూ నేటి ప్రపంచంలో విద్యార్థులు పోటీ పడి ఇష్టంతో చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాగృతి డిగ్రీ కళాశాల చైర్మన్ జీఎస్ రాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ సి క్రిష్టారెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామస్వామి, అనంత్‌రెడ్డి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పాపగారి ఆశీర్వాదం, హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు అజంతా, బి ఈశ్వర్, డాక్టర్ అశోక్, డాక్టర్ ఎం నాగరాజు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మన్నే శ్రీనివాస్, దీపికలు, సామాజిక కార్యకర్త, విద్యార్థులు పాల్గొన్నారు.